

# ఆదర్శం

"మిత్రమా! వెంకటప్పయ్యా!

మీ నవ వధూవరులకు నా శుభాకాంక్షలు!

లేఖా మూలంగా నీ క్షమాభిక్ష వేడుకో దలచు కున్నా —నీ ఆదర్శాన్నే అపార్థం చేసుకొన్న నీవు నన్నేం అర్థం చేసుకోగలవనే అపనమ్మకం మాత్రం లేకపో లేదు. ...వస్తానని చెప్పి నీవివాహానికి రాలేక పోయాను. ఈ రాలేక పోవడమనేది నా ఉద్దేశ పూర్వకమైనది మాత్రం కాదు. అది పరిస్థితుల ప్రభావం. నీకు నా పరిస్థితులు చెప్పకుంటే అర్థంకావు. అర్థం చేసుకోవడానికి తద్విషయానుభవమైనా ఉండాలి; అదీ లేకపోతే — సానుభూతీ, సహృదయత అయినా ఉండాలి. నీకు మొదటిది లేదని తేలిపోయింది. పోతే, రెండవది ఉందో, లేదో నాకు ఇంకా తెలియదు.

ఈ లేఖ వ్రాయడంలో గల ఉద్దేశాలు రెండు. మొదటిది అయిపోయింది. రెండవది—ముచ్చటగా మూడు

ముక్కల్లో చెప్పదలచుకొన్నా — నీ వైవాహికోత్సాహం మూలంగా ఆ రెండు నాళ్ళూ నాకు కలిగిన అనుభవాలను ఒక్కసారి సింహావలోకనం చేసుకోకుండా ఉండలేక పోతున్నాను.

నీవు తలపెట్టిన కార్యం ఆదర్శమైనదే! సందేహం లేదు! అందరికంటే కూడా అది నీకే బాగా తెలుసు. బడిలో పిల్లల కోలాహలం నాకు ఎంత సుపరిచితమో, "ఆదర్శప్రాయంగా ఉండా లనుకుంటున్నాను" అనే నీ మాట కూడ అంత సుపరిచితమై పోయింది. ఆదర్శం అనేది ఎవరో మహానుభావులలో తప్ప—కానరాని సుగుణం. అది నీలో ఉన్నది. అయినా, లేనిదొక్కటే!...దానిని అర్థం చేసుకోగల విజ్ఞత.

నీకు, నాకు గల పరిచయం బహుస్వల్పం. ఆ పరిచయమైనా ఉద్యోగానికి సంబంధించినది. నీకంటే ముందు నుంచి సమితి అజమాయిషీ క్రింద ఉంటున్న ప్రాథమికోపాధ్యాయుణ్ణి నేను. గత నాలుగు మాసాలుగా సదరు సమితిలో, సదరు శాఖకు సంబంధించిన గుమాస్తావు నీవు.

...సమస్యారూపంలో సంసారిని బాధించేది—'దినము' అనబడే కాలప్రమాణం. ఆ దినము అనే దుష్టశక్తిని తలెత్తనీక కట్టి పడవేయడానికి దారంలా ఉపకరించే సాధనం—అతని నెలజీతం! ముప్పైదినాలను ఒక్క వర్తులంతో బంధించివేయడానికి ఆ దారం చాలకపోగా—వ

నాలుగైదు రోజులలో కట్లు త్రెంచుకుని, అతనిపైన బడటానికి కాచుకొని ఉంటాయి. నేను అటువంటి దీనావస్థలో ఉండగా—చిరునవ్వు ముఖంతో నీవు కనిపించావు.

..."ఏమండోయ్! శుభవార్త!" అన్నావు.

...దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి, పాపభారాన్ని మోయలేక కృంగిపోతున్న భూదేవి అశ్రువులను తుడవటానికి వీరవసంతరాయ లేమైనా అవతరించాడా?... ప్రపంచాన్ని దుష్టశక్తుల నుండి తప్పించి శాంతి సౌభాగ్య సీమలలోకి నడిపించే స్వర్గపథాన్ని ఏ దేశమైనా కనుగొన్నదా?...లేక ఏ రష్యావాడో—భూవలయమంతా ఆశ్చర్యంతో స్తంభించి పోయేంత అకస్మాత్తుగా గ్రహాంతరాలను లోబరచుకొని, వాటిని నివాసయోగ్యం చేయ గలిగాడా?...

"త్వరలో నాకు పెళ్లి కాబోతున్నది!"

!—సంతోషమే!...మనిషి తన్ను తాను తెలుసుకోటానికిగల మార్గంలో గృహస్థాశ్రమం ఒక మజిలీ! దాదాపు ఏభైకోట్ల భారతీయ సోదరులలో ఒకడు గేస్తు కాబోతున్నాడు...

"ఎప్పుడు? ఎవరు? ఎక్కడ?" అన్న ప్రశ్నలకు—ఆనందోత్సాహాలే జలరాశిగా గలిగి ఉరవడితో ప్రవహించే మహానదిలా చకచకా చెప్పుకు పోయావు.

"కల్యాణ మొచ్చినా, కక్కొచ్చినా ఆగదనే పెద్దల సిద్ధాంతం నా విషయంలో అక్షరాలా నిజమైంది. ఈ పెండ్లి వల్ల నాకు కలిగే లాభంమాత్రం శూన్యమేనండోయ్!... మా వాడలో వాళ్ళకు, నా మిత్రులకు ఆదర్శప్రాయంగా ఉందామన్న సదుద్దేశంతోనే ఈ కార్యంలో కాలు బెడు తున్నాను. మూడు నెలల క్రితంనుంచి వాగ్రూపంలో సాగి వస్తూన్న ఈ ప్రయత్నం ఈ నాడు కొద్ది మార్పులతో కార్య రూపం దాల్చింది. మిమ్మల్ని ఒక సోదరుడిలా భావించి ఉన్నదున్నట్లు చెబుతున్నాను...పూట గడవని సంసారం వాళ్ళది. వారికి గల సంతానం ఇద్దరు ఆడపిల్లలు మాత్రమే! మూడు నెలల క్రిందట ఏదో పనిమీద ఆ వూరు వెళ్ళడం సంభవించింది. వారి పరిస్థితి చూసి నా మనస్సు వెన్నలా కరిగిపోయింది. పెద్దమ్మాయి పేరు అంజమ్మ. మూడో ఫారంతో చదువు మానేసింది. చిన్నమ్మాయి పేరు మారెమ్మ. రెండవఫారం చదువుకుంటోంది. పేదరికం ఒక్కటి లేకపోతే—నిజంగా వారిని దేవకన్యలనవచ్చు. గుణానికి కొదవ లేదు. వారి తండ్రిపేరు మాతయ్య. పండు ముసలివాడు. పని చేయడానికి వోపిక, శక్తి లేనివాడు. తనది అనుకోడానికి నాలుగడుగుల నేల అయినా లేదతనికి. పాపం—ఆ ముసలావిడ, పిల్లలు కూలికి వెళ్ళివస్తేగాని పూట గడవదు. "మాతయ్యా! మా వెంకటప్పయ్య పిల్లల కోసం తెగ తిరుగుతున్నాడు మీ అమ్మాయినిస్తావా?"

అన్నాడు ఒక మిత్రుడు మాతయ్యతో—పరిహాసంగా. ఆ పరిహాసమే నిజమై కూర్చుంది. పరిచయం పాతబడిన తరువాత—ఆ ముసలాయన నా చేతులు పట్టుకుని "బాబూ! ఇక నువ్వే మాకు దిక్కు! అల్లుడివైనా, కొడుకువైనా నువ్వే! ఇవి చేతులుకావు కాళ్ళనుకో!" అంటూ పసిపిల్లవాడిలా ఏడ్చేశాడు. నా గుండెకాయ నీరైపోయింది. "ఫరవాలేదు, నేనున్నానులే—" అని అతనికి ధైర్యం చెప్పాను. నాకెందుకో చిన్నమ్మాయిపైన మనసు పడింది. కాని పెద్దమ్మాయికి పెళ్లి కానిదే చిన్నమ్మాయిని పెళ్లిచేసుకోవడం జరగదు. కనుక ఈ సంవత్సరం పెద్దమ్మాయిని టీచర్స్ ట్రెయినింగులో చేర్పించి, ఆమెకు బ్రతుకుతెరువు అయినా చూపించి తరువాత—చిన్నమ్మాయిని పెళ్లిచేసుకుందామనుకున్నాను. కానీ, తానొకటి తలిస్తే దైవమొకటి తలచిందన్నట్లు—వారంరోజుల క్రితం వూహించని ఘోరం ఒకటి జరిగిపోయింది..." అంటూ కథను సస్పెన్సులో ఆపేశావు.

"ఏమిటీ ఆ ఘోరం?" అన్నాను నేను.

"మరిచిపోయాను... లగ్నపత్రిక పట్టుకొచ్చాను. పెళ్లిపత్రికలు అచ్చు వేయించాలి. వీటిలో ఏ మోడలు బాగుంటుంది?" కొన్ని ఆహ్వానపత్రికల మాదిరిప్రతులు తీసి చూపించావు.

వాటి పనితనం చూచి నా కళ్లు జిగేలుమన్నాయి. ఉన్నంతలో సాఫీగా జీవయాత్ర సాగించడానికి— పొదుపు,

నిరాడంబరం అనేవి రెండూ రెండు తెడ్లు. అదే అన్నాను నీతో. "నా ఉద్దేశం కూడా అదేలే! చవకరకం కాగితం మీద సాదాగానే అచ్చు వేయిద్దామనుకుంటున్నా. మనకు మిత్రులు ఎక్కువమంది. అందులోనూ—పెద్ద తరహావారు. అదీ వచ్చిన చిక్కు!...ఆఁ! తరవాత కథ—ఆగిపోయింది కదూ!? అతడు పోయాడా..."

"ఎవరు?..."

"కష్టాలు భరించలేక మాతయ్య నూతిలోపడి ఆత్మ హత్య చేసుకున్నాడు. ఇప్పుడు కథ అడ్డం తిరిగింది. పాపం-ముసలివాడికి మాట ఇచ్చాను. ఆడినమాట తప్పడం న్యాయం కాదుకదా?...పెద్దమ్మాయికి ట్రైనింగు స్కూల్లో సీటురాలేదు. పోతే ఇద్దరు పిల్లల్ని పోషించేశక్తి ముసలా విడకు లేదు. పోనీ—పెద్దమ్మాయికి పెళ్ళిచేసేద్దా మను కుంటే—మరొక ఆదర్శవంతుడు దొరకాలి గదా?...కనుక పెద్దమ్మాయినే వివాహం చేసుకో దలచుకున్నాను. చిన్న మ్మాయి కేంలే—చదువుకుంటూ ఉంటుంది...పెద్దమ్మాయి అందంగానే ఉంటుంది. పేరుకూడా అందంగా ఉండాలని 'అంజలి' అని మార్చుకున్నాను. ఏం? నేను చేసింది మంచి పనేనంటావా?..."

మంచిపనే! దేశంలో ప్రతి ఒక్కడూ వెంకటప్పయ్య అయితే సమాజాన్ని చదును చేయడం క్షణాలమీద పని. "నీ వివాహ విషయంలో నీ తల్లిదండ్రుల జోక్యం ఎంత మాత్రం?" అని అడిగాను.

"వారిని ఒప్పించేసరికి తలప్రాణం తోకకొచ్చిందనుకో!... వారికి ఈ పెళ్ళి సుతరామూ ఇష్టం లేదు. "అప్పుడే పెళ్ళాం కావాలట్రా నీకు? ఒకమాట ముందే మాతో చెప్పిఉంటే మంచి సంబంధం తెచ్చేవాళ్లం కదట్రా!... నచ్చినపిల్ల అనిజెప్పి దరిద్రానికి తాళి గట్టుతున్నా వేమిట్రా?" అంటూ దుమారం లేవదీశారు. పెద్దవాళ్లై పోయారు—అంతమాత్రం తెలియదూ?... మనకు ధనం ప్రధానం కాదు. గుణం! ఏమంటావ్?...ఆపత్కాలంలో ఆ కుటుంబాన్ని ఆదుకోగలగడంలో నాకెంతో ఆనందం, గర్వం ఉన్నాయి!... నా మొండితనంచూచి ఇక చేయగలిగిందేమో లేక, పెండ్లి ఖర్చులకు ఒక అయిదు వందలు బాకీ తీసి ఇచ్చాడు మా నాన్న. ఎంత నిరాడంబరంగా జరుపుకోవాలన్నా కనీసం వెయ్యి రూపాయలైనా కావాలి!... ఏమంటావ్?"

ఈ ఆడంబరానికీ, నిరాడంబరానికి ఒక నికరమైన ప్రమాణమంటూ లేదు. ఆయా వ్యక్తుల దృష్టిలో వాటి ప్రమాణం ఆయా వ్యక్తుల స్వభావాన్ని బట్టి ఉంటుంది. నా ఎరుకలో ఏభై వేల రూపాయల పెండ్లిలోనూ లోటు కనిపించింది. ఏభై రూపాయల పెండ్లిలో పరిపూర్ణతా కనిపించింది... అటువంటప్పుడు నేనేమనగలను?

"అన్నట్టు—బ్రదర్! నువ్వు ఏమిటేమిటో వ్రాస్తూ ఉంటావుకదూ?... నా పెళ్ళికిచక్కని పద్యాలు వ్రాసుకొచ్చి చదువుతావు కదూ?" అన్నావు.

కవిత్వం ఒక ప్రవాహం! దానికి కావలసింది స్వాగతం కాదు, ఆవేశం! ఆ ఆవేశం యొక్క కొలత విషయంపైన ఆధారపడి ఉంటుంది. మేరునగాన్ని గంభీరంగా ఉన్నదని వర్ణిస్తే—అది కవిత్వమే అనబడుతుంది. అలా కాక—ఇసుక దిబ్బలోని తుంగను మేరునగంతో పోల్చి వర్ణిస్తే అది కవిత్వంకాదు, దానిపేరు ముఖస్తుతి!...

"ఇక పెళ్ళికి ఉన్న వ్యవధి నాలుగు రోజులే! నీతో నాకు చాలా పనులున్నాయి. స్పీకరు, లైటింగు వగైరాలు ఏర్పాటు చేసుకోవాలి, వంట బ్రాహ్మణ్ణి కుదుర్చుకోవాలి, పెండ్లి పత్రికలు అచ్చువేయించాలి...నీ సహాయం నాకు చాలా అవసరం. అన్నింటికంటే ముఖ్యమైన అవసరం ఏమిటీ అంటే—దయచేసి ఈ పెళ్ళికి ఒక రెండువందలు సర్దాలి. తరువాత తీసుకోవచ్చు..." అన్నావు.

...హాతోస్మి! రెండు వందలు! ఆ రెండువందల్లో రెండు శాతమైనా ఉన్నదా ఆ సమయంలో? జీతమే ఆధారంగా బ్రతికే వాణ్ణి, సహాయం చేయగల యోగ్యత నాకున్నదా?...దానం చేసే స్తోమత నీకు లేకపోతే దానం వేయగల వాణ్ణయినా చూపించు అనేది ఒక ఆర్యోక్తి. నీకు డబ్బిచ్చి బ్రోవగల ఋణ దాతల్ని కొందర్ని సూచించాను.

"పోనీ, రేపో మాపో జీతం వస్తుందిగా?...పాతిక రూపాయలైనా ఇవ్వు, స్పీకరు సెట్టుకైనా అవుతుంది" అన్నావు, వెళ్ళిపోయావు.

కథా నిలయం
60951
శ్రీకాకుళం



మరునాడు నాకు జీతం వచ్చింది...రైల్వే కూడలిలో ఎందరో ప్రయాణీకులు వస్తుంటారు, పోతుంటారు, ఎవరూ అక్కడే డేరా వేసి కూర్చోరు. జీతం కూడా అంతే! అది ఎక్కడినుంచో ఈ గుప్పిట్లోకి వస్తుంది! పిడికిలి విప్పి చూసే సరికి అది అక్కడ ఉండదు.

మధ్యాహ్నం సౌండ్ సిస్టం మహబూబ్ వచ్చాడు. "వెంకటప్పయ్య నీతో ఏమీ చెప్పలేదా?" అని అడిగాడు. "ఏమీ చెప్పలేదే!" అన్నాను. "డబ్బేమైనా ఇచ్చాడా?" అన్నాడు. లేదన్నాను. "స్పీకరు, లైట్ల విషయంలో నాతో మాట్లాడాడు. ముప్పై రూపాయలవుతుందన్నాను. నీకి్యా వల్సిన డబ్బు పంతులుదగ్గర తీసుకో, నే చెప్పానులే— అన్నాడు...అందుకని..." అన్నాడు మహబూబ్. "వెంకటప్పయ్య వస్తే అతనితో మాట్లాడుతానులే..." అని చెప్పి అతణ్ణి పంపించేశాను.

ఆ సాయంకాలం మూడు గంటలకు నువ్వు వచ్చావు. మహబూబ్ విషయం ప్రస్తావించాను. "అవును, చెప్పాను. నీ దగ్గర లేకపోతే ఫరవాలేదులే! ఎల్లాగైనా ఇవ్వొచ్చు" అంటూ సంచీలోంచి ఆహ్వాన పత్రికలు పైకితీసి చూపించావు. ఐదురకాల ఆహ్వాన పత్రికలు అచ్చొత్తించడం నా ఎరుకలో ఇదే తొలిసారి!...ఆర్థిక సమస్య పీడిస్తున్నప్పుడు చేయవలసిన అన్ని హంగుల్లో ఒకదాన్ని ఆదరించి, మిగిలిన వాటిని నిర్లక్ష్యం చేయడం ప్రమాదంగా పర్యవసించగలదు.

“బ్రదర్! నాకు సహాయంచేసే వాళ్ళెవరూ లేరు— మీలాంటి మిత్రులు తప్ప! కాస్త బజారుకు వెళ్ళివద్దాం, వస్తావా?” అన్నావు.

ప్రధానోపాధ్యాయుని వద్ద ఒకగంట అనుమతి పుచ్చుకుని, నీతో బజారుకు బయలుదేరాను. “వంటబ్రాహ్మ డేమో దొరికాడు. వస్తానన్నాడు. నీకు ఏదైనా చిల్లర కొట్టులో కాతా ఉంటే చెప్పు. వందరూపాయల చిల్లర సరుకులు కావాలి. తరువాత ఇచ్చుకుందాము...” అన్నావు నాతో. సహాయం చేయడం సామాన్యమైన విషయంకాదు. అందుకు సామర్థ్యం కావాలి. సింహపు గుహలో దూరితే ఏనుగుదంతాలు దొరుకుతాయి గాని—నక్క బొరియలో కెలికితే ఏముంటాయి? ఎండ్రకాయ బొచ్చెలు!... నా పేరున వందరూపాయలకు అరువిచ్చే వాడెవడున్నాడు?... అప్పుడు నాకు అనిపించింది—“ఇతడు నిజంగా వెంకటప్ప య్యేనా, లేక నా గుట్టునంతా రట్టుచేయడానికి వచ్చిన సైతానా?...” అని

...తరువాత, మహబూబ్ దగ్గరికి వెళ్లాము. ఎడ్వాన్సుగా నువ్విచ్చిన ఐదురూపాయలు మహబూబ్ తీసుకోక పోగా—“బ్రదర్! ఇక్కడేఉండు. ఒక మనిషి మూడు వందలిస్తానన్నాడు. తీసుకొస్తాను.” అంటూ ఎక్కడికో వెళ్లి పోయావు. ఒకప్రక్క—నాకు కాలాతీతమై పోతున్నది. ధర్మానికి, మైత్రికి లడాయిపెట్టి నీవు వెళ్లిపోయావు. చివరికి ధర్మమే జయించింది. నేను పాఠశాలకు వెళ్లిపోయాను.

సాయంకాలం బడినవదలిన తర్వాత, అలా బజారు వైపు వచ్చాను. నీవు కనిపించనే కనిపించావు. ''ఏది ఏమైనా— ఈ పెళ్ళి ఆగదు. బ్రదర్!... వెధవది— అన్నీ కష్టాలే! ఆదర్శప్రాయంగా వివాహం చేసుకుంటున్నాను. అందరూ ఆదర్శమో, ఆదర్శమో అనే వాళ్ళేగానీ సమయానికి ఆదుకొని సహాయం చేసే వాళ్లుమాత్రం లేరు... సరే, నేను వస్తానింక! ఏదీ, ఒక్క రూపాయి ఇవ్వు. బస్సు ఛార్జీకి కావాలి!... పెళ్ళికి మాత్రం తప్పక వచ్చేయాలి సుమా!...'' అంటూ రూపాయి తీసుకుని, కదులుతూ ఉన్న బస్సులోకి ఎక్కి కూర్చున్నావు.

బస్సు వెళ్ళిపోయింది. నాకప్పుడు అవకాశమే చిక్కి ఉంటే— ఇప్పుడు నీకీ సుదీర్ఘమైన లేఖ వ్రాయవలసిన అవసరం ఏర్పడేది కాదు. ఇంతకూ నేను చెప్పదలచుకొన్నదిది.

ప్రపంచంలో సుఖశాంతులతో తులతూగే జీవి ఒక్కడూ లేడు. వాడికి తగిన కష్టనిష్ఠూరాలు వాడికి ఉండనే ఉంటాయి. వాడు హాయిగా బ్రతుకుతున్నాడు. మనం కష్టపడుతూంటే చూచీ చూడనట్లున్నాడు— అనుకుని వాపోవటం పొరపాటు. తన ఏడుపు వినిపించి సాటివాని సానుభూతి పొందుదామనుకునే వాడేగాని సాటివాడి ఏడుపు విని సానుభూతి చూపించుదామనుకునేవాడు కోటికొక్కడుంటాడేమో!?

ఆదర్శాన్ని వరించినంత మాత్రాన అది గొప్పతనం కానేరదు. దాన్ని ఆచరించి, కృతకృత్యుడు కావటంలోనే

ఉంది గొప్పతనం. ఆదర్శప్రాయంగా వివాహం చేసుకుందా మనుకుంటున్న సమయంలోనే కష్టాలు వచ్చి పడ్డాయన్నావు. ఆదర్శం వేరే, కష్టాలు వేరే కావు. ఆదర్శమంటేనే కష్టాలు. ఆదర్శప్రాయంగా ఉండడమంటే—కష్టాలను ఎదుర్కో వడం!... కష్టాలను ఎదుర్కో లేకపోతే హరిశ్చంద్రుడు, శ్రీరామచంద్రుడు మొదలైనవారు ఆదర్శపురుషులు కాగ లిగేవారు కారు. ఆదర్శం ఉండరాదని నేననడం లేదు. ఉండడం మంచిదే! అయితే—ఆదర్శంయొక్క విలువను గుర్తించి ఆదరించగల చిత్తశుద్ధికూడా ఉండాలి. అప్పుడే అది ఆదర్శం కాగలదు!

అనివార్య కారణాలవలన నీ వివాహానికి రాలేక పోయినా పెండ్లి కానుకగా నీకు నేనివ్వగల "పద్య పంచ రత్నములు" మాత్రం పైమాటలే! సెలవు!

నీ మిత్రుడు
పంతులు

★★